సాక్షి అనకాపల్లి

సోమవారం । 12 । ఆగస్టు । 2024



'కృత్యాధార'తో సత్ఫలితాలు

అభ్యసన కృత్యాల బోధనతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఈ విషయంలో పెదబోదిగల్లం తెలుగు టీచర్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. 8లో



ఆకట్టుకున్న నాటికలు

యలమంచిలి నందీశ్వర వేదికపై ప్రదర్శించిన 'రాత', 'దానానికి దారులెన్నో' నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. 8లో



వికసించిన బ్రహ్మకమలం

యలమంచిలి: కొత్తపేటలోని కొప్పిశెట్టి నాగేశ్వరావు ఇంటి ఆవరణలో ఆదివారం వికసించిన బ్రహ్మకమలం ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

అమ్మకు వేపాకులతో అలంకరణ



వేపాకులతో అలంకరించిన నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారిని శ్రావణమాసం భాను సప్తమిని పురస్కరించుకుని వేపాకులతో అలంకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిధిలో భక్తులు శనివారం వారి స్వగృహం వద్ద అమ్మవారి పాట నిర్వహించి, ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకుని, కుటుంబ సమేతంగా వంటలు చేసి, నైవేద్యం సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'సరుగుడు' వద్ద పర్యాటకుల జోష్



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి కిందకు జాలువారే జలప్రవాహాన్ని చూసేందుకు, జలకాలు ఆడేందుకు పోటీ పడ్డారు. రెండు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వచ్చారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. తాండవ రిజర్వాయర్‌పై కూడా సందర్శకులు సందడి కనిపించింది.

నాందేడ్-శ్రీకాకుళం మధ్య స్పెషల్



తాటిచెట్లపాలెం(విశాఖ): వరుస సెలవుల కారణంగా నెలకొన్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నాందేడ్-శ్రీకాకుళం రోడ్- నాందేడ్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. నాందేడ్-శ్రీకాకుళంరోడ్ (07487) స్పెషల్ ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నాందేడ్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 9.12 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నాందేడ్-శ్రీకాకుళం రోడ్ (07488) స్పెషల్ ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.33 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 7.35 గంలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.25 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఇరువైపులా ముద్కేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి.

20 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

మహారాణిపేట: జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 20 నుంచి చేపట్టనున్నారు. రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటర్ల జాబితాలో సవరణలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 20 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్(బీఎల్‌వో)లు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా ఇప్పుడు ఓటరుగా నమోదు చేసుకోవచ్చును. అక్టోబర్ 18 నాటికి ప్రక్రియ పూర్తి చేసి, అదే నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.



యూటర్న్ బాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరోసారి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలిపింది. గతంలో పాఠశాలల విలీన జీవో నెం.117పై టీడీపీ నేతలు నానా యాగీ చేశారు. అధికారం లోకి వచ్చాక దాన్ని రద్దు చేస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు టీచర్ల సర్దుబాటులో పాఠశాలల విలీనం ప్రస్తావన లేకుండానే మిగులు పోస్టుల్ని నిర్ణయించారు. సోమ, మంగళవారాల్లో మిగులు టీచర్లను సర్దుబాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

టీచర్లకు సర్దుపాట్లు

- ఉపాధ్యాయుల సర్దుబాటుకు విద్యాశాఖ సన్నాహాలు
- ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు కొరత తీర్చేందుకంటూ ఆదేశాలు
- టీఐఎస్ వివరాల ఆధారంగా సర్దుబాటుకు ఏర్పాట్లు
- గత ప్రభుత్వంలో స్కూళ్ల విలీనంపై అప్పటి ప్రతిపక్ష పార్టీ టీడీపీ విమర్శలు
- ఇప్పుడు వాటి జోలికి వెళ్లకుండా సర్దుబాట్లు చేయడంపై టీచర్ల ఆగ్రహం
- విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాట్లు చేయడంపై ఆవేదన
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఎంఈవోతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు(ఫైల్)

అచ్యుతాపురం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సర్దుబాటు బెంగ పట్టుకుంది. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీనంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిజానికి నూతన విద్యా విధానంలో భాగంగా దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య, దూరం ఆధారంగా ఎలిమెంటరీ, యూపీ పాఠశాలల విలీనం అనంతరం ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేశారు. ఎన్నికలకు ఏడాది ముందు ఉపాధ్యాయ బదిలీలు కూడా చేపట్టారు. ఈ విలీన ప్రక్రియను అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించిన అప్పటి ప్రతిపక్షం, ప్రస్తుత అధికారపక్షమైన టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సర్దుబాటు ప్రక్రియకు తెరలేపింది. దీంతో గత ప్రభుత్వం చేపట్టిన విలీన ప్రక్రియకు కూటమి ప్రభుత్వం పరోక్షంగా ఆమోదం తెలిపినట్లే కదా..! అని ఉపాధ్యాయ సంఘాలు ఆక్షేపిస్తున్నాయి.

టీఐఎస్‌లో ఇప్పటికే నిక్షిప్తం

కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తీవ్ర ప్రభావం చూపినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో చాలా పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిలో తేడా వచ్చింది. దీంతో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లో టీచర్ల వివరాలను నమోదు చేయించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు ఉపాధ్యాయుల్ని ఖరారు చేశారు. మరోవైపు చాలా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో మిగులు సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ)లో వారి అదనపు విద్యార్హతను బట్టి సబ్జెక్టు టీచర్లుగా పంపించాలని నిర్ణయించారు. అయితే ఇది తాత్కాలికమా, శాశ్వతమా అన్న నిర్ధారణ లేదు. మరోవైపు వచ్చే ఏడాది జనవరి నాటికి డీఎస్సీ-2024 నియామకాలు చేపట్టాలి. అప్పుడు మళ్లీ ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేయాలి.

సీనియార్టీ ఆధారంగా మిగులు నిర్ధారణ

మిగులు పోస్టుల నిర్ధారణలో కేడర్(సర్వీస్) సీనియార్టీని ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇందులో జూనియర్లను మాత్రమే మిగులు టీచర్లుగా నిర్ణయిస్తారు. గతంలో సీనియర్ కోరుకుంటే వారిని సర్దుబాటు జాబితాలో చేర్చేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా కేవలం కేడర్ జూనియర్‌ను మాత్రమే సర్దుబాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ 14వ తేదీలోగా పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు. ఆదివారం సాయంత్రం నుంచి మిగులు పోస్టులపై జిల్లా విద్యాశాఖ కసరత్తు మొదలెట్టింది. సోమవారం మధ్యాహ్నానికి ఏయే స్కూళ్లలో, ఏయే సబ్జెక్టులకు టీచర్లు అవసరమో ఖరారు చేసి, ఆ మేరకు మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వీరు 13, 14 తేదీల్లో కొత్త స్కూళ్లలో విధుల్లో చేరాల్సి ఉంటుంది. తొలుత ఈ ప్రక్రియ 10వ తేదీ(శనివారం)కే పూర్తి కావాలి. అయితే కేడర్ సీనియార్టీ/స్టేషన్ సీనియార్టీపై నెలకొన్న సందిగ్ధత నేపథ్యంలో కాస్త జాప్యం నెలకొంది.

ఎంటీఎస్‌లపైనే తొలి వేటు?

ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియలో తొలి వేటు మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులపైనే పడనుంది. గత ప్రభుత్వం 2008, 1998 డీఎస్సీ బాధితులకు న్యాయం చేస్తూ ఎంటీఎస్ ప్రాతిపదికన ఖాళీ పోస్టులతో పాటు, యూపీ పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా నియమించారు. వీరికి టీఏ, డీఏలు లేని కారణంగా వారి నివాస మండలాలనే కేటాయించారు. ఇప్పుడు సర్దుబాటులో ముందుగా బలయ్యేది వీరే. ఇప్పుడు మండల స్థాయి, డివిజన్ స్థాయి సర్దుబాట్లు చేస్తే మళ్లీ తాము ఎక్కడికి వెళ్లాల్సి ఉంటుందోనని ఎంటీఎస్ టీచర్లలో ఆందోళన నెలకొంది.

నేడు మండలాల పరిధిలో కౌన్సెలింగ్

అచ్యుతాపురం: ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి తొలి ప్రాధాన్యతను ఎంఈవోలకు అప్పగించారు. ఎంఈవో(డీడీవో)ల లాగిన్‌లో ఉన్న సర్‌ప్లస్ ఉపాధ్యాయుల జాబితా, అవసరమైన సబ్జెక్టు టీచర్ల వివరాల బట్టి మధ్యాహ్నం 11 గంటలలోపు మార్పులు చేసుకునే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు తుది జాబితా ప్రకటించి, అనంతరం సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మండల స్థాయిలో సర్‌ప్లస్ అయిన ఉపాధ్యాయులను మళ్లీ డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈవో ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తుది పర్యవేక్షణ జిల్లా విద్యాశాఖ అధికారి చేపట్టనున్నారు. టీచర్ల సర్దుబాటు గణాంకాల సమాచారమంతా ఆయా ఎంఈవోల లాగిన్‌లలోనే ఉంది. మిగుల పోస్టులెన్నో నేడు లెక్క తేలనుంది.

తగ్గిన విద్యార్థుల సంఖ్యతో అవస్థలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల బదిలీలు, మరికొన్న చోట్ల ఉపాధ్యాయుల మరణాలు వంటి కారణాలతో ఖాళీ పోస్టులను ఆయా మండలాల పరిధిలో సర్దుబాటు చేయొచ్చు. విద్యార్థుల సంఖ్య తగ్గినందున సర్దుబాటు అనివార్యం. టీఐఎస్‌లో నమోదు చేసుకున్న విద్యార్థుల ఆధారంగా సర్దుబాట్లు చేస్తే ఎవరి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేమని టీచర్ల ఆవేదన. పాఠశాలలు ప్రారంభించి రెండు నెలలు పూర్తయ్యాయి. నాడు-నేడు పనుల నిలిపివేత, పాఠశాల యాజమాన్య కమిటీల నియామకం పేరిట కాలయాపన, ఎఫ్-1 పరీక్షల వాయిదా వంటి కారణాలతో ఇప్పటికే విద్యావ్యవస్థ గందరగోళంగా మారింది. పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు వాస్తవ స్థితిగతుల్ని, ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ప్రమాదస్థాయికి చేరువలో తాండవ నీటి మట్టం



తాండవ రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతూ ప్రమాదస్థాయికి చేరుకుంటోంది. ఆదివారం సాయంత్రానికి 375.3 అడుగులకు నీటిమట్టం పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో రోజుకు 300 క్యూసెక్కుల వరకు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు. నీటి మట్టం 378 అడుగులకు చేరుకోగానే హెచ్చరికలు జారీ చేస్తారు. ఆయకట్టు దిగువ ప్రాంతంలో ఉన్న నాతవరం, కోటనందూరు మండలాల పరిధిలో గల రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు ప్రజలకు సమాచారం ఇచ్చి తాండవ ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తారు. నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ రిజర్వాయర్ గట్టుపై ఉన్న జాలరిపేట గ్రామస్తులకు తాండవ ప్రాజెక్టు అధికారులు సూచించారు. రిజర్వాయర్‌లోకి ఎవరూ దిగరాదని, చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. నీటి మట్టం పెరిగితే ఏ సమయంలోనైనా నీటిని విడుదల చేస్తామంటూ తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ తెలిపారు.

అవయవదానంపై అవగాహన సదస్సు రేపు

ఆరిలోవ: ఈ నెల 13న అవయవ దానం దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ఏయూ అవుట్ గేట్ నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా వరకు వాక్‌థాన్ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జరగనున్న సదస్సులో కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ హాజరుకానున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- రోగులకు ఎలాంటి ఇబ్బంది లేదు
- ప్రమాద కారణాలపై విచారణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ
- ఆస్పత్రుల్లో తరచూ ప్రమాదాలపై ఆందోళన



సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ బాగ్చి

మహారాణిపేట: నగరంలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఐదో అంతస్తులోని హెచ్‌ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఫైల్స్, ఫర్నిచర్ కాలిపోయాయి. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఆస్పత్రిలో రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆదివారం కావడంతో హెచ్‌ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో సిబ్బంది కూడా ఎవరూ లేరు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని అగ్ని మాపక సిబ్బంది చెబుతున్నారు.

పోలీస్ కమిషనర్ సందర్శన

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రమాద ఘటన తెలిసిన వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకొని పరిసరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిస్థితులను స్వయంగా చూశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సంఘటనపై విచారణ చేస్తున్నామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. ఆస్పత్రి యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగవన్నారు.

మంటలు అదుపులోకి..

నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపులోకి తెచ్చామని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి రేణుకయ్య తెలిపారు. స్కై లిఫ్ట్ ద్వారా నేరుగా ప్రమాదం జరిగిన అంతస్తులోనే వాటర్ స్ప్రే చేశామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో మంటలను అదుపు చేసే శిక్షణ కలిగిన సిబ్బంది ఆస్పత్రిలో లేరన్నారు. నష్టం వివరాలు ఇంకా తెలియలేదన్నారు.

ఫైర్ ఎన్‌వోసీ తనిఖీ

డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరావు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఫైర్ ఎన్‌వోసీని జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) ఎం.నాగేశ్వరరావు ఆదివారం తనిఖీ చేశారు. 4,5,6 అంతస్తులను పరిశీలించారు. ఆస్పత్రికి ఫైర్ ఎన్‌వోసీ వచ్చే ఏడాది అక్టోబర్ వరకు ఉందని తెలిపారు.

వరుస ప్రమాదాలు

నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో ఆందోళన నెలకొంది. ఇటీవల ఇండస్ ఇండ్, మెడికవర్ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల భద్రత ప్రశ్నార్థకంగానే మారింది. పర్యవేక్షణ లోపమా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

వైభవంగా నృసింహ హోమం



నృసింహహోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహ హోమం వైభవంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను అధిష్టింపజేసి పుణ్యాహవచనం, విష్వక్సేన ఆరాధన చేశారు. అనంతరం మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి వెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అనంతరం ఆ పవిత్ర జలాలను భక్తులపై చల్లారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

గజరాజసమేది?

భూమిపై నివసించే జంతువుల్లో అతి పెద్దది ఏనుగు. దీని సగటు జీవిత కాలం 70 ఏళ్లు. ఇది ఆహారం కోసం అడవిలో సుదూరం ప్రయాణించి అన్ని రకాల పండ్లను తింటుంది. అనంతరం దూర ప్రాంతాలకు వెళ్లి విసర్జన చేస్తుంది. ఆ విసర్జనలో పండ్ల గింజలు విత్తనాలుగా మారి అక్కడ చెట్లు పెరిగి దట్టమైన అడవి ఏర్పడుతుంది. అలా అడవుల విస్తీర్ణంలో ఏనుగు భాగస్వామి అవుతుంది. అటువంటి ఏనుగులు ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరాయి. వీటిపై ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం మీ కోసం...

- అంతరించిపోయే దశకు ఏనుగులు
- దేశంలో సుమారు 50 శాతం తగ్గుదల
- అడవుల నరికివేత, ఆహార కొరతే ప్రధాన కారణం
- ఆంధ్రప్రదేశ్‌లో 242 ఏనుగులు ఉన్నట్లు నిర్ధారణ
- నేడు ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం




ఏనుగుకు స్నానం చేయిస్తున్న మావటి(ఫైల్)

ఆరిలోవ: ప్రపంచంలో ఏనుగులు రెండు రకాలున్నాయి. ఆఫ్రికా ఏనుగులు, ఆసియా ఏనుగులు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్స్(ఐయూసీఎస్) ప్రకారం ఆసియా ఖండపు ఏనుగులు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఆ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఏనుగుల దంతాలతో తయారు చేసిన అలంకరణ వస్తువులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. దీంతో స్మగ్లర్లు వాటి దంతాలతో వ్యాపారం చేస్తున్నారు. అదే వాటి సంఖ్య తగ్గిపోవడానికి కారణమైందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. గడిచిన సుమారు 50 ఏళ్లలో 13 దేశాల్లో నివసించే ఆసియా ఏనుగులు 70 శాతం వరకు తగ్గిపోయినట్లు ఐయూసీఎస్ గుర్తించింది. అందులో మన దేశంలో సుమారు 50 శాతం ఏనుగులు తగ్గిపోయాయని నిర్ధారించింది. వాతావరణంలో తీవ్ర మార్పులు, అడవులు నరికేయడం, ఆహార భద్రత లేకపోవడంతో ఏనుగుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. వాటి పునరుత్పత్తికి అనువైన వాతావరణం లేకపోవడంతో ఆ సంఖ్య పెరుగుదల నిలిచిపోతోంది. పర్యావరణంలో ఏ ఒక్క జాతి తగ్గినా మానవాళికే ముప్పు కలగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2012లో ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం జరుపుకోవాలని థాయ్‌లాండ్‌కు చెందిన 'ఎలిఫెంట్రీ ఇంట్రొడక్షన్ ఫౌండేషన్' అనే సంస్థ నిర్ణయించింది. మొదటిసారిగా అదే సంవత్సరం ఆగస్టు 12న థాయ్‌లాండ్‌లో ఏనుగుల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. అప్పట్లో వారి పిలుపుతో వివిధ దేశాల్లో 65కు పైగా అంతర్జాతీయ వన్యప్రాణి సంరక్షణ సంస్థలు ఏనుగుల సంరక్షణ కోసం ముందుకొచ్చాయి.

దేశంలో ఎలిఫెంట్ రిజర్వ్‌లు **33**

2012లో ఏనుగుల సంఖ్య	2017లో ఏనుగుల సంఖ్య
31,368	27,312




అత్యధికంగా కర్ణాటకలో 6,500

దేశంలో 2012 తర్వాత ప్రత్యేకంగా ఎలిఫెంట్ రిజర్వ్‌లు ఏర్పాటు చేయడంతో వాటి సంరక్షణ పెరిగి పునరుత్పత్తి కూడా పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 25,000 నుంచి 29,000 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాటిలో ఆంధ్రప్రదేశ్‌లో 242 ఉన్నట్లు గుర్తించారు. అవి కూడా ఎక్కువగా శ్రీకాకుళం, చిత్తూరు అడవుల్లో కనిపిస్తున్నాయి. అన్నింటి కంటే ఎక్కువగా కర్ణాటకలో సుమారు 6,500 ఏనుగులు ఉన్నాయి. అత్యల్పంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మిజోరంలలో పది లోపే ఉన్నట్లు గుర్తించారు.

ఒక్కో ఏనుగుకు 220 కిలోల ఆహారం

విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో సరస్వతి(58), లక్ష్మి(26), కృష్ణ(43), రాజు(16) అని పిలిచే నాలుగు ఏనుగులున్నాయి. రోజుకు ఒక్కోదానికి సుమారు 220 కిలోల ఆహారం అందిస్తారు. అందులో 40 కిలోల చెరకు, బెల్లం కలిపిన ఆరు కిలోల రాగి తోప, ఒక కిలో తవుడు, 120 కిలోల అరటి దవ్వ, 40 కిలోల గడ్డి, రెండు కొబ్బరి కాయలు, రెండు పుచ్చకాయలు, రెండు పెడల అరటి పళ్లు, కిలో తోటకూర తదితర ఆహారం ఇస్తున్నారు. ఒక్కో ఏనుగు కనీసం 150 లీటర్ల నీరు తాగుతుంది.



దీనికయ్యే వ్యయం ఏడాదికి రూ.4.30 లక్షలుగా నిర్ణయించారు. జూలో అన్ని జంతువుల కంటే వీటికే ఖర్చు ఎక్కువ. అందుకే జంతు ప్రేమికులు ఎవ్వరూ వీటిని దత్తత తీసుకోవడానికి ముందుకు రాలేకపోతున్నారు.

ఏనుగులను సంరక్షిస్తున్నాం



ఇక్కడ నాలుగు ఏనుగులను పూర్తిస్థాయిలో సంరక్షిస్తున్నాం. వాటి కోసం ప్రత్యేకంగా నీటి కొలను నిర్మించాం. ఆహారంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నాం. వాటి సంరక్షణ వ్యయంతో కూడుకున్నది. జంతు ప్రేమికులు వాటిని దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తే బాగుంటుంది. ఏనుగుల సంరక్షణపై అవగాహన కల్పించడానికి పాఠశాల విద్యార్థులకు ఏటా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ నందనీ సలారియా, జూ క్యూరేటర్

క్లుప్తంగా

సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశం


బొజ్జన్నకొండ వద్ద కలుసుకున్న సర్పంచ్‌లు

అనకాపల్లి: మండలంలో బొజ్జన్నకొండ వద్ద మండలలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శంకరం సర్పంచ్ వసుపులేటి లక్ష్మీ రామకృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలో సర్పంచ్‌లు వచ్చే వారంలో నూతన కమిటీని ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సర్పంచ్‌ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు మొదటి మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సమావేశానికి కొద్దిమంది మాత్రమే హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వనభోజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మోదమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి తోపులాటలు లేకుండా భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని వచ్చిన వందమంది మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

300 మందికి ఉచిత వైద్యం

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మంది రోగులకు సేవలందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు రాయుడు శ్రీనివాస్, సంపత్ కుమార్ 74 మందికి రక్త పరీక్షలు, 08 మందికి థైరాయిడ్ పరీక్షలు, 10 మందికి ఫిజియోథెరపీ చేశారన్నారు. పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 80 మందికి నేత్ర పరీక్షలు చేశారన్నారు. 25 మందికి కళ్లజోళ్లు అందించామని తెలిపారు. ఈ శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటి బాబు, వలంటీర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కృత్యాధార బోధనతో సత్ఫలితాలు

అభ్యసనం అనేది అత్యంత సరళమైనది. పిల్లల స్వభావాన్ని గుర్తించి, వారు అభ్యసనంలో చురుగ్గా పాల్గొనేలా చేయడం ఒక కళ. దీని కోసం అభ్యసన కృత్యాలతో బోధన జరుపుతూ మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్ ఆచార్యులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. అన్ని తరగతుల్లోను ఆయా పాఠ్యాంశాలలో అన్ని అంశాలను ముందుగానే గుర్తించి ఖర్చులేని, అతి తక్కువ ఖర్చుతో బోధనాభ్యాసన కృత్యాలను తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

- జీరో బేస్డ్ బడ్జెట్‌తో బోధనా కృత్యాలు
- విద్యార్థుల నుంచి విశేష స్పందన
- జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా బోధన


కవుల చిత్రాలను వారి చరిత్రను బోధనాకృత్యాలుగా తయారు చేసి బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఆచార్యులు

నక్కపల్లి: విద్యార్థులకు నాణ్యతతో కూడిన బోధన అందించాలంటే అభ్యసన కృత్యాలు తయారీ అత్యంత ప్రధానమైనది. వీటి ద్వారా పిల్లల్లో అన్వేషణ, పరిశీలన, ఆలోచించడం, ప్రశ్నించే సామర్థ్యాలు పెంపొందించవచ్చు. బోధన జరపడం అంటే కేవలం చెప్పడం, వినిపించడం ద్వారా నేర్చుకునేది మాత్రమే కాదని, అది ఒక కళ అని అన్వేషణ, ప్రదర్శనలు వీటన్నింటి ద్వారా పిల్లలు ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేయడమని ఉపాధ్యాయుడు ఆచార్యులు నిరూపిస్తున్నారు. బోధనా లక్ష్యం అంటే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే అంటున్నారు. పాఠశాల గ్రంథాలయం సద్వినియోగం చేసుకోవడం, పుస్తకాలు, మేగజైన్‌లు చదవడం, దినపత్రికల్లో అంశాలను చదివి వాటిని విశ్లేషించేలా చేయడం అనేవి బోధనలో భాగంగా చేసుకున్నారు. పిల్లలు ప్రశంసలు, ప్రోత్సాహాన్ని కోరుకునేలా అందమైన డిజైన్లతో కూడిన బోధనా కృత్యాలను తయారు చేయడంలో ఆయన పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయుల సృజనాత్మకత ఉత్తేజపూరిత , స్నేహపూర్వక సమ్మిళిత వాతావరణంలో కృత్యధార బోధన చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయంటున్నారు. ఆచార్యులు పనిచేసే బోదిగల్లం పాఠశాలలో వివిధ తరగతులకు సంబంధించి పాఠ్యాంశాల్లో కవుల చిత్రాలు, కవి పరిచయాలను ఫ్లకార్డులపై బొమ్మల రూపంలో వేయించడం, వారి గురించి సమగ్రంగా వాటిపై రాయించడం, తదుపరి విద్యార్థులకు వాటిని వివరించడం, పూర్తిగా అవగాహన వచ్చిన విద్యార్థులతో తోటి విద్యార్థులకు వాటిని బోధించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగు సబ్జెక్టుకు సంబంధించి చందస్సు, వ్యాకరణాలను కూడా ఇలా బోధనా కృత్యాలను తయారు చేయించి సులభంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. చిత్రాలను చూసి పాఠ్యాంశంలో సారాంశాన్ని ఊహాజనితంగా పిల్లలతో సొంత మాటల్లో చెప్పిస్తున్నారు. ఈ విధానం వల్ల పుస్తకాల్లో పాఠ్యాంశాలను విద్యార్థులు తొందరగా అర్థం చేసుకోవడంతో పాటు పాఠ్యాంశాలను చిరకాలం గుర్తుంచు కుంటారని, పరీక్షల సమయంలో బట్టీ పెట్టి చదవడం, ఒత్తిడికి లోనవడం వంటి సమస్యలు ఉండవని తెలిపారు. ఒక్క తెలుగు మాత్రమే కాదు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు కూడా ఇటువంటి విధానాన్ని అవలంబిస్తూ విద్యార్థులు, విద్యాశాఖ అధికారుల మన్ననలు పొందుతున్నారు.


విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న ఉపాధ్యాయుడు

విద్యార్థుల నుంచి చక్కని స్పందన



విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేని విద్య అందిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. వీటిలో ప్రధానమైనవి బోధన ఆభ్యాసన కృత్యాలు. విద్యార్థులకు సులభమైన రీతిలో వారికి అర్థమయ్యేలా బోధిస్తే మంచి జ్ఞాపకశక్తితో ఉంటారు. ఖర్చు లేకుండా తయారు చేసే బోధనా కృత్యాల ద్వారా బోధన చేస్తే విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. డ్రాపౌట్ల సంఖ్య కూడా తగ్గించవచ్చు. పాఠాల్లో సారాంశాలను బొమ్మల రూపంలో విద్యార్థులకు వివరించి ఊహాజనితంగా వారి సొంత మాటల్లోనే తిరిగి చెప్పేలా తర్ఫీదు నిస్తున్నాం. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

–ఎన్.వి.ఎస్ ఆచార్యులు, తెలుగు ఉపాధ్యాయుడు

పాఠ్యాంశాలపై ఆసక్తి పెరిగింది



మా పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే సందర్భంలో ఆ పాఠాలకు సంబంధించిన సామగ్రిని తయారు చేయించి అర్థమయ్యేలా బోధిస్తున్నారు. మాకు వచ్చిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇలా బోధించడం వల్ల మాకు చదువుకోవాలనే ఆసక్తి మరింత పెరుగుతోంది. –చరణ్, 8వ తరగతి విద్యార్థి

ఒత్తిడి లేకుండా చదువు



ప్రతిరోజు మా ఉపాధ్యాయులు పాఠాలను బోధించేటప్పుడు పాఠాలలో ఉన్న అంశాలను సులభంగా అర్థమయ్యేలా ఖర్చు లేకుండా చార్టులను తయారు చేయించి ప్రదర్శించి చర్చించడం ద్వారా బోధిస్తున్నారు. ఇలా చెప్పడం వల్ల చదువుపై ఆసక్తి పెరిగి మంచి ఫలితాలు సాధిస్తానన్న నమ్మకం కలిగింది. ఒత్తిడి లేని బోధన అందుతోంది. ఈ విధానం చాలా బాగుంది.

–కమిడి జయ, పదో తరగతి విద్యార్థి

బోధనాకృత్యాలపై మెరుగైన ఫలితాలు



అన్ని పాఠశాలల్లో జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా విద్యాబోధన జరుగుతోంది. బోధనా కృత్యాలు అభ్యసనా సామగ్రి ద్వారా మెళకువలను పాటిస్తూ విద్యాబోధన చేయాలని ఆదేశించడం వల్ల అన్ని పాఠశాలల్లో ఈ విధానం అమలు జరుగుతోంది. ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సందేహాలను నిపుణులు, రీసోర్స్ పర్సన్‌లతో నివృత్తి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పాఠశాలల్లో బోధనా తీరును కూడా పరిశీలిస్తున్నాం. మండలంలో కృత్యాధార బోధనతో గతేడాది మంచి ఫలితాలు సాధించడం జరిగింది. –కుంచం నరేష్, ఎంఈవో

ఇంటింటి కుళాయిల పనుల్లో నాణ్యతా లోపం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



దేవరాపల్లి: మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద చేపడుతున్న ఇంటింటి కుళాయిల పైపులైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. ఆదివారం పైప్‌లైన్ పనులను పరిశీలించిన అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పైపులైన్ పనుల పర్యవేక్షణతో పాటు నాణ్యతాప్రమాణాలు పాటించాల్సిన అధికార్లు సదరు కాంట్రాక్టర్ ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. డ్రిప్ ఇరిగేషన్ మాదిరిగా ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారని, భవిష్యత్‌లో కుళాయిల ద్వారా నీరు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. మేజర్ పంచాయతీలో కోట్లాది రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఇష్టానుసారం ధ్వంసం చేస్తున్నారన్నారని తెలిపారు. ఇటు ఇంజినీరింగ్ అధికారులతో పాటు అటు పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టానుసారం రోడ్లను తవ్వేస్తున్నారని తెలిపారు. పలు చోట్ల డ్రైనేజీలు దెబ్బతిని పూడికు పోయాయని చెప్పారు. ఇష్టానుసారంగా రోడ్లను ధ్వంసం చేసిన కాంట్రాక్టర్‌పైన, కాసులకు కక్కుర్తిపడి పర్యవేక్షణ పట్టించుకోని అధికారులపైన విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు సీపీఎం నేత వెంకన్న స్పష్టం చేశారు.

సరిహద్దు విషయంలో వివాదం మహిళపై కత్తితో దాడి


మహిళ తల వెనుకన గాయమైన దృశ్యం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు తెలిపారు. మండలంలోని నాగులాపల్లికి చెందిన నూకరత్నానికి అదే మండలం అరబుపాలెం గ్రామానికి చెందిన మళ్ల సూర్యనారాయణతో 30 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆ సమయంలో పుట్టింటి వారు ఆమెకు 40 సెంట్ల స్థలం ఇచ్చారు.తన తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన 40 సెంట్ల భూమిలో ఆదివారం ఉదయం నూకరత్నం సిమెంట్ స్తంభాలు పాతుతుండగా సరిహద్దు విషయమై గొడవ జరిగింది. అదే ప్రాంతానికి చెందిన పెంటకోట శివ కత్తితో నూకరత్నంపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తల వెనుక భాగంలో, మోచేయిపై తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు నూకరత్నంను అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1990 బ్యాచ్ పోలీసుల ఆత్మీయ కలయిక


తుమ్మపాల బంగారురాజు కల్యాణమండపంలో సమావేశమైన 1990 బ్యాచ్ పోలీసులు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల గ్రామంలో బంగారురాజు కల్యాణమండలంలో 1990వ సంవత్సరం బ్యాచ్ పోలీసుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న, అలాగే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న అప్పటి పోలీసు సిబ్బంది ఆదివారం కలుసుకుని తమ శిక్షణ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ బ్యాచ్‌లో పదవీ విరమణ చేసిన వారిని కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నేటికి 34 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మగంటి అనిల్, కార్యదర్శి సాగి సాయిబాబారాజు పాల్గొన్నారు. ఉదయం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో 1990 బ్యాచి పోలీసు ఉద్యోగులు వెంకటేశ్వర్లు, సుబ్బరాజు, ముబారక్, బోని శ్రీనివాసరావు, లక్ష్మణరావు, పూర్ణ, నర్సింగరావు, అనంత్‌తో పాటు 82 మంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు

- ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం


రాత దర్శకుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న దాడి

మునగపాక: ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా నందీశ్వర వేదికపై ఏర్పాటు చేసిన 'రాత', 'దానానికి దారులెన్నో' నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాల్లో భాగంగా మునగపాక నందీశ్వర తులసీ కళావేదికపై ఆదివారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'రాత' నాటికకు రచన, దర్శకత్వం శ్రీనివాసరావు పోలిదాసు అందించారు. అనకాపల్లికి చెందిన శ్రీ షిర్డీ సాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన 'దానానికి దారులెన్నో..' నాటిక ఆహుతులను అలరించింది. ఈ నాటికకు పి.టి. మాధవ్ రచన అందించగా పి.ముత్యాలరావు దర్శకత్వం వహించారు. నాటికోత్సవాలను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి సందేశాలిచ్చే నాటికలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. టీవీలు, సినిమాల ప్రభావంగా కళ కోల్పోతున్న నాటక రంగాన్ని బతికించు కోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. మునగపాకలో కళలను ప్రోత్సహిస్తూ ఏటా పరిషత్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు.

యువజన మందిరం ఉపాధ్యక్షుడు దాడి అప్పలనాయుడు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, టెక్కలి కొండలరావు, గ్రామీణ యువజన సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి రాము, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, యువజన మందిరం కార్యదర్శి ఆడారి సోమశేఖర్, వేగి సూర్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట జగన్నాథం మాస్టారు, పాలకవర్గ సభ్యులు మళ్ల కృష్ణ, ఆడారి సూరిబాబు, దాడి సాంబశివ, బీజేపీ ఐటీవి భాగం జిల్లా అధ్యక్షుడు మళ్ల కాశేశ్వరరావు పాల్గొన్నారు.

'చాపరాయి' వద్ద సందడి



డుంబ్రిగుడ: మన్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పర్యాటకుల రాక మొదలైంది. ఆదివారం చాపరాయి జలవిహారి, కొల్లాపుట్టు జలతరంగిణి వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. బాంబో చికెన్, ఫాస్ట్ ఫుడ్ అమ్మకాలు జోరుగా సాగాయి. కొల్లాపుట్టు జలతరంగిణికి పర్యాటకుల తాకిడి నెలకొంది.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

గంగవరం : భయ్యనపల్లి పంచాయతీ పాతరామవరం గ్రామ శివారులో ఓ రైతు పొలంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.4 లక్షల విలువైన 81 ఎర్రచందనం దుంగలు గుర్తించినట్లు ఫోక్స్‌పేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్ తెలిపారు. అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో రామారావు ఆధ్వర్యంలో స్క్వాడ్, ఫోక్స్‌పేట రేంజ్ అటవీశాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. దొరమామిడికి చెందిన రైతు గంగరాజు పొలంలోనివిగా తేలిందన్నారు.

జలవిద్యుత్ కేంద్రాలకు ఊపిరి

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జోలాపుట్టు జలాశయంలో భారీగా నీరు చేరడం జలవిద్యుత్ కేంద్రాలకు ఊరట నిస్తోంది. జిల్లాలో మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలు ఈ ప్రాజెక్టులో చేరే నీటిపై ఆధారపడి ఉన్నాయి. ఇరు రాష్ట్రాల సరిహద్దులో 238 గ్రామాల పరిధిలో 24 వేల ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్ట్ నీటిమట్టం గతేదాది ఇదే సమయానికన్నా 26 అడుగులు ఎక్కువగా ఉంది.

- పెరుగుతున్న జోలాపుట్టు జలాశయ నిల్వలు
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు చేరిక
- రోజురోజుకు పెరుగుతున్న నీటిమట్టం
- గత ఏడాది ఇదే సమయానికన్నా 26 అడుగులు ఎక్కువ
- తీరనున్న నీటి కొరత
- పూర్తిస్థాయి ఉత్పాదనకు అవకాశం


జోలాపుట్టు జలాశయం నుంచి డుడుమ జలాశయానికి విడుదల అవుతున్న వరద నీరు

ముంచంగిపుట్టు/మోతుగూడెం: జిల్లాలో జలవిద్యుత్ కేంద్రాలతోపాటు గోదావరి డెల్టాకు నీరందించడంలో జోలాపుట్టు ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో ఈ జలాశయం ఒడిశాలో 156 గ్రామాల పరిధిలో 18,200 ఎకరాలు, ఆంధ్రాలో 82 గ్రామాల పరిధిలో 5,800 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇరు రాష్ట్రాల సరిహద్దులో కురిసే వర్షాలతోపాటు మత్స్యగెడ్డ నీరు ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆధారం. ఇక్కడి నుంచి డుడుమ జలాశయం ద్వారా మాచ్‌ఖండ్ ప్రాజెక్టుకు చేరుతుంది. అక్కడ విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదల అయ్యే నీటిపై సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలతోపాటు బలిమెల, డుడుమ, డొంకరాయి జలాశయాలు ఆధారపడ్డాయి. అంతేకాకుండా బెట్ట పరిస్థితులలో గోదావరి డెల్టాలోని సుమారు 7 నుంచి 9 లక్షల ఎకరాలకు 90 టీఎంసీల నీటిని అందిస్తూ సస్యశ్యామలం చేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాజెక్టులో భారీగా వరదనీరు చేరుతోంది.

చరిత్ర ప్రాధాన్యమిలా..

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు నీరు సరఫరా నిమిత్తం జోలాపుట్టు జలాశయాన్ని 1955లో బ్రిటిష్ వారు నిర్మించారు. ఈ జలాశయం నుంచి నాలుగు నీటి విడుదలకు రెండు పవర్ సెల్స్, మరో రెండు స్పేర్‌సెల్స్ ఉన్నాయి. వీటి ద్వారా షవర్ మాదిరిగా నీటి విడుదల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

నాలుగు జలాశయాలకు..

జోలాపుట్టు: ఈ జలాశయం నిల్వ సామర్థ్యం 16 టీఎంసీలు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో కురిసిన వర్షాలకు ఈ ప్రాజెక్టులో నీరు చేరుతుంది. ఈ నీరు నాలుగు జలవిద్యుత్ కేంద్రాలకు సరఫరా అవుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 2,750 అడుగులు, ప్రస్తుతం 2,740 అడుగులమేర ఉంది. గతేడాది ఇదే సమయానికి 2,714 అడుగులు మాత్రమే ఉండేది. అదనంగా 26 అడుగుల మేర నీరు ఉంది.

డుడుమ: స్టోరేజ్ ట్యాంక్‌గా ఉపయోగపడుతున్న జోలాపుట్టు జలాశయం నుంచి ఈ ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. ఇక్కడి నుంచి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి సరఫరా అవుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 2,590 అడుగులు. ప్రస్తుతం 2,588 అడుగులు ఉంది. భారీగా వరదనీరు చేరడంతో గత రెండు నెలల్లో మూడు సార్లు ప్రమాదస్థాయికి చేరింది. సుమారు 2 వేల నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

బలిమెల: ఒడిశాలో ఉన్న ఈ ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 110 టీఎంసీలు. ఇక్కడి నీటిని ఇరు జలాశయాలు విద్యుత్ అవసరాలతోపాటు సాగునీటిగా వినియోగించుకుంటాయి. మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం మత్స్యగెడ్డ ద్వారా నీరు ఈ జలాశయంలో చేరుతుంది.

గుంటవాడ: సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి కీలకమైన ఈప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 3.5 టీఎంలు. బలిమెల నుంచి వస్తున్న నీటిని విద్యుత్ ఉత్పాదనకు వినియోగిస్తారు. పూర్తిస్థాయి నీటిమ ట్టం 1360 అడుగులు, ప్రస్తుతం 1342 అడుగులు ఉంది.

డొంకరాయి: జలవిద్యుత్‌తోపాటు గోదావరి డెల్టాకు సాగునీరందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 13 టీఎంసీలు. ఇక్కడ 30 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. అనంతరం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి సరఫరా అవుతోంది. అక్కడ విద్యుత్ ఉత్పాదన అనంతరం సీలేరు నదిలో కలుస్తుంది. శబరి ద్వారా గోదావరిలో కలు స్తుంది. గోదావరి డెల్టాలో రబీ రైతుల అవసరాల నిమిత్తం 4 నెలలపాటు సుమారు 90 టీఎంసీల నీటిని జలవనరులశాఖ వినియోగించుకుంటోంది. పూర్తిస్థాయి నీటిమటట్టం 1037 అడుగులు కాగా ప్రస్తుతం 1029 అడుగుల మేర నీరు ఉంది.

ఆధారపడిన ప్రాజెక్టులిలా..


సీలేరు జల విద్యుత్ కేంద్రం

సీలేరు జలవిద్యుత్ కేంద్రం: ఇక్కడ 60 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయి. ఒకొక్క యూనిట్‌లో విద్యుత్ ఉత్పాదనకు సుమారు 1300 క్యూసెక్కులు అవసరం.

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం: ఈ ప్రాజెక్టులో 17 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లు, 23 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌లో విద్యుత్ ఉత్పాదనకు రోజుకు సుమారు 1300 క్యూసెక్కులు అవసరం.

డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం: ఇక్కడ 30 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందుకు గాను రోజుకు నాలుగు వేల క్యూసెక్కులు అవసరం.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం: ఇక్కడ నాలుగు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఒక్కో యూనిట్ ద్వారా 115 మెగావాట్ల చొప్పున 460 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. యూనిట్‌కు సుమారు 1300 క్యూసెక్కుల నీరు అవసరం. మరో రెండు యూనిట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు జనవరి నుంచి ఏప్రిల్ వరకు మాత్రమే గోదావరి డెల్టాలో 7 నుంచి 9 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడుతుంది.

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం: ఈ ప్రాజెక్టులో 17 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లు, 23 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లు ఉన్నాయి. ఒకొక్క యూనిట్‌లో విద్యుత్ ఉత్పాదనకు రోజుకు సుమారు 1300 క్యూసెక్కులు అవసరం.

సీలేరు జలవిద్యుత్ కేంద్రం: ఇక్కడ 60 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయి. ఒకొక్క యూనిట్‌లో విద్యుత్ ఉత్పాదనకు సుమారు 1300 క్యూసెక్కులు అవసరం.

డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం: ఇక్కడ 30 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందుకు గాను రోజుకు నాలుగు వేల క్యూసెక్కులు అవసరం.

వారపు సంత.. సమస్యల చింత

పల్లెలకు ప్రధాన ఆకర్షణ సంతలే. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వ్యాపారులు ఆయా ప్రాంతాల్లో ఆదరణ పొందిన సామగ్రిని వివిధ ప్రాంతాలకు తీసుకొచ్చి విక్రయిస్తూ ఉంటారు. వాటిని సంతకు వచ్చిన ప్రజలు కొనుగోలు చేసి ఆనందిస్తారు. వ్యాపారులు ఎంతో కొంత ఆర్జనతో సంతోషంగా ఇంటి దారి పడతారు. అయితే కశింకోటలో జరిగే వారపు సంతలో మాత్రం వ్యాపారులు కనీస సదుపాయాలు, సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


ప్రధాన పంచాయతీ రోడ్డుపై నిర్వహిస్తున్న వారపు సంత


కనీస సదుపాయాలు లేని సంత

- సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న వ్యాపారులు
- భారీ వాహనాల రాకపోకలతో భయంభయంగా విక్రయాలు
- మంచినీటికి కూడా కటకటలాడుతున్నామని ఆవేదన

కశింకోట : ప్రధాన పంచాయతీ రహదారిపై కొన సాగుతున్న వారపు సంత వల్ల ట్రాఫిక్ ఇబ్బంది నెలకొనడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 20 వేల జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ప్రతి గురువారం వారపు సంత జరుగుతుంది. కశింకోట, అనకాపల్లి, మునగపాక, యలమంచిలి మండలాలకు చెందిన వ్యాపారులు, ప్రజలు సంతకు వస్తుంటారు. ప్రజలు ఇక్కడి నుంచి కూరగాయలు, ఆకు కూరలు, పప్పులు, మసాలా దినుసులు, వస్త్రాలు, పండ్లు, చేపలు, మాంసాహారాలు వగైరా కొనుగోలు చేసి తీసుకెళ్తారు. అయితే సంత నిర్వహణకు సరైన స్థలం లేదు. దీంతో ప్రత్యామ్నాయం లేక పంచాయతీ ప్రధాన రహదారి మీదే సంత నిర్వహించాల్సి వస్తోందని అధికారులంటున్నారు. దీని వల్ల లారీలు, ప్రైవేటు స్కూలు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో వాహనాల వల్ల ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదానికి గురి కావలసి వస్తుందోనని ఒక వైపు వ్యాపారులు, మరో వైపు కొనుగోలు చేయడానికి వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంతలో కొంత మంది వ్యాపారులకు నిర్దిష్టమైన స్థలం లేక దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సంతలో నీడ లేకపోవడంతో ఎండ కాసినా, వర్షం వచ్చినా దుకాణాలు విడిచి రోడ్డు పక్క ఇతర దుకాణాల వద్ద రక్షణ పొందాల్సి వస్తోందని వాపోతున్నారు. రూ.50 వరకు ఆశీలు తీసుకుంటున్నప్పటికీ కనీసం మంచినీటి సదుపాయం కూడా కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. సంతలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి నిర్దిష్టమైన స్థలాన్ని కేటాయించాలని, ట్రాఫిక్ సమస్య నియంత్రించాలని, మంచినీటి సదుపాయం, నీడ ఏర్పాటు చేయాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

కనీస సదుపాయాలు లేవు..



కశింకోట వారపు సంతలో కనీస సదుపాయాలు లేవు. దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి నిర్దిష్టమైన స్థలం ఉండటం లేదు. సంత సంతకు ఎక్కడ పడితే అక్కడ దుకాణం ఏర్పాటు చేసుకోవలసి వస్తోంది. దీని వల్ల ప్రజలకు తెలియక అమ్మకాలు తగ్గిపోయి నష్టపోవాల్సి వస్తోంది. ఆశీలు రూపంలో రూ. 30 నుంచి రూ. 50 వరకు తీసుకుంటున్నా నిర్దిష్టమైన స్థలం చూపక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– సేనాపతి లక్ష్మి, చిరు వ్యాపారి, జి. భీమవరం

భారీ వాహనాలను నియంత్రించాలి..



కశింకోట సంతలో కనీసం మంచి నీటి సదుపాయం లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. నీరు కొనుగోలు చేసి తాగుతున్నాం. సంత రోజు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి. లేదంటే వాటి వల్ల ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో అమ్మకాలు సాగించాల్సి వస్తోంది. అధికారులు భారీ వాహనాలకు అడ్డుకట్ట వేసి, మంచినీటి సదుపాయం కల్పించాలి.

– యల్లపు మణి, కూరగాయల వ్యాపారి, యలమంచిలి

ప్రత్యామ్నాయం లేకే..

ప్రత్యామ్నాయం లేక పంచాయతీ ప్రధాన రోడ్డు మీదే వారపు సంత నిర్వహిస్తున్నాం. సంత రోజు ట్రాఫిక్ నియంత్రణకు రోడ్డులో ఒక వైపు మాత్రమే వాహనాలు రాకపోకలు సాగించడానికి చర్యలు చేపట్టాం. ఆదాయం, నిధులు లేక సదుపాయాలు కల్పించలేకపోతున్నాం.

– రమేష్, పంచాయతీ కార్యదర్శి, కశింకోట.

క్లుప్తంగా

మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ

అనకాపల్లి : మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామనే స్ఫూర్తితో ప్రజలందరూ సహకరించాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి స్థానిక మెయిన్ రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 8 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

వర్గీకరణతో ఉపకులాలు నష్టపోతాయి

తుమ్మపాల : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరిగితే అనేక ఉపకులాలు నష్టపోతాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బోన గణేష్ అన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ విషయాన్ని ఎన్నికల ముందు తెరమీదకి తీసుకొచ్చారన్నారు. వర్గీకరణ గనుక జరిగితే జిల్లాల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాలలంతా కలిసి భవిష్యత్తు తరాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సియాద్రి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మోనిటరీ మెంబర్ గంగాధర్ మరియమ్మ, అప్పలరాజు, రాజన బుజ్జిబాబు, తట్టా రాజు, మరువడ ఈశ్వరరావు, పతివాడ నాగభూషణం పాల్గొన్నారు

ఘనంగా ఊంజల్ సేవ


ఉయ్యాల సేవలో భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం రాత్రి ఉయ్యాల సేవ ఘనంగా జరిగింది. వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి పల్లకి కమిటీ ఆధ్వర్యంలో ఉయ్యాల సేవ 7వ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాటం, సంగీత లహరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీనివాస నామస్మరణతో నాగులాపల్లి మార్మోగింది.

15న భక్త చింతామణి పద్య నాటకం ప్రదర్శన

మునగపాక : తిమ్మరాజుపేటలో ఈ నెల 15న భక్త చింతామణి పద్య నాటక ప్రదర్శన జరుగుతుందని సర్పంచ్ బీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దుర్గాలమ్మ తల్లి పండగ సందర్భంగా కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, బీవీఏ నాయుడు సారథ్యంలో రాత్రి 9 గంటలకు రామాలయం గుడి ఆవరణలో ప్రదర్శన జరుగుతుందన్నారు.

అనకాపల్లి సినిమాలు

పాగల్ v/s కాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
సూపర్ డీలక్స్	: శ్రీసత్య
భవనమ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 70 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-42 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 231 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

అనకాపల్లి : ఎలియన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షునిగా కడిమిశెట్టి పీవీ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ గ్రంధి కన్నయ్య పంతులు హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ కార్యదర్శిగా కె.వి.సత్యనారాయణ, కోశాధికారిగా వీఎస్‌కే హరనాథ్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, పీఎస్వీ రవికుమార్, సహాయ కార్యదర్శిగా పి.శంకర్‌తో పాటు 13 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా వైస్ గవర్నర్ అల్లూరి ఉషారాణి వ్యవహరించారు. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ బి.తిరుపతిరాజు మాట్లాడుతూ అనకాపల్లిలో మొదటిసారిగా క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. పట్టణం, మండలంలో క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.విశ్వేశ్వరరావు, ఎస్.మహేశ్వరరావు, కె.రాజేశ్వరరావు, కడిమిశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.


క్లబ్ సభ్యులతో అల్లూరి ఉషారాణి, తిరుపతిరాజు తదితరులు

భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు

తుమ్మపాల : బడిఈడు పిల్లలు భిక్షాటన చేయడం రోడ్లపై నిత్యం చూస్తూనే ఉంటాం. అలా వచ్చిన నగదుతో కుటుంబానికి సహాయంగా ఉంటారనుకుని అందరం తోచిన చిల్లరి ఇస్తూ పిల్లలను శాశ్వతంగా బిచ్చగాళ్లను చేసేస్తున్నాం. దీంతో పిల్లల భిక్షాటన ఇప్పుడు నేరుగా దేవాలయాల్లోనే సాగుతోంది. ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో బడిఈడు పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. పట్టణం, కశింకోట ప్రాంతాల నుంచి 20 మందికి పైగా బడిఈడు పిల్లలు వివిధ వేషధారణలు, పేర్లు మార్చుకుంటు, అంగవైకల్యం ప్రదర్శిస్తు భిక్షాటన చేస్తు రోజంతా గడిపేస్తున్నారు. అమ్మవారి దర్శనం నిమిత్తం వచ్చిన భక్తుల నుంచి చిల్లరతో పాటు ప్రసాదాలు, భోజనం దొరకడంతో రాత్రి 8 వరకు ఉంటునప్పటికీ పట్టించుకునేవారే లేకుండా పోయారు. దేవాలయంలో ఈవో కార్యాలయం వద్ద నేలపై వరుసగా కూర్చుని భిక్షాటన చేస్తున్న పిల్లలు అధికారులకు కనిపించడం లేదు. కనీసం ల్యాబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ అధికారులైనా దృష్టి సారించి వారి వివరాలు తెలుసుకుని పాఠశాలల్లో చేర్పించాలని భక్తులు కోరుతున్నారు.


శ్రీనూకాంబికా ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు

ఉపాధి కోర్సులతో ఆసరా

కశింకోట : మహిళలు ఆర్థికంగా బలపడటానికి టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు దోహదపడతాయని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో మహిళలు ఏ కార్యక్రమం చేపట్టినా విజయం తథ్యమన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌తో వారి కుటుంబాలకు ఆసరా దొరుకుతుందన్నారు. 40 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం శివ రాజశేఖర్, సేవాదళ్ కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యస్వామి, శిక్షకులు నాగమణి, హేమ, కన్వీనర్ వెంకటరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలనాయుడు

29న దుర్గాలమ్మ జాతర

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరులో ఈ నెల 29న దుర్గాలమ్మ అమ్మవారి జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం సమావేశమయ్యారు. ఏర్పాట్లపై కూలంకషంగా చర్చించారు. ఈ నెల 21న జాతర చాటింపు, 29న పండగ నిర్వహించేందుకు తీర్మానించారు. సమావేశంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి

రాంబిల్లి (యలమంచిలి) : రాంబిల్లి మండలం ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను అధికారులు తొలగించాలని జిల్లా డీవైఎఫ్ఐ నాయకులు చింతకాయల శివాజీ కోరారు. ఆదివారం మండలంలో రాంబిల్లి నుంచి కొత్తపట్నం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పొరం కంచె తుప్పలను డీవైఎఫ్ఐ నాయకులు ఆధ్వర్యంలో తొలగించారు. రహదారికి అడ్డుగా ఏపుగా పెరిగిన పిచ్చి తుప్పలను వారు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి పోవడం వల్ల రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రోడ్లపైకి చెట్ల కొమ్మలు అడ్డు రావడం వల్ల భారీ వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాంబిల్లి ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణరావు, శ్రీను, అప్పలరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



రాంబిల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

క్షతగాత్రునికి ఆర్థిక సాయం అందజేత

నక్కపల్లి : గత ఏడాది జాతీయ రహదారిపై సారిపల్లిపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులై మంచానికే పరిమితమైన నక్కపల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పెదపూడి కిరణ్ కుమార్ కుటుంబానికి విశాఖపట్నానికి చెందిన స్పందన చేయూత ఫౌండేషన్, మరికొంత మంది మిత్రులు కలిసి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆలపాటి సుబ్బారావు చేతుల మీదుగా కిరణ్‌కుమార్ కుటుంబానికి రూ.36,500 నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌తో పాటు ఆయన భార్య, కుమార్తె కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆలపాటి సుబ్బారావు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా నక్కపల్లి మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంవత్సరానికి 50 మందికి స్కాలర్‌షిప్పులు అందజేస్తున్నామన్నారు. మహిళలకు టైలరింగ్ నేర్పించి మిషన్‌లు అ ందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, భీశెట్టి శివాజీ, రాజేశ్వరరావు, అమరలింగేశ్వరరావు, యచేంద్ర, డి.రాంబాబు పాల్గొన్నారు.


కిరణ్ కుటుంబానికి నగదు సాయం అందిస్తున్న దాతలు


మాడుగుల: జంపెనలో ఆలస్యంగా దమ్ము చేస్తున్న రైతు


మోటారు నీరు తోడి నాట్లు వేస్తున్న రైతులు

ఖరీఫ్ వరి.. కన్నీటి ఝరి

- మెట్ట ప్రాంతాల్లో నీరు లేక సాగని ఖరీఫ్ సాగు
- బుచ్చెయ్యపేటలో 2,700 ఎకరాలు, మాడుగులలో 2 వేల ఎకరాల్లో పడని నాట్లు
- వరుణుడి కరుణ కోసం ఆశగా నిరీక్షిస్తున్న అన్నదాత

బుచ్చెయ్యపేట/మాడుగుల: భారీ వర్షాలు కురిశాయన్న ఆనందం రైతులకు పట్టుమని పదిహేను రోజులు కూడా మిగల్లేదు. వేసవిని తలపిస్తున్న ఎండలకు, సాగునీటి వసతి లేని బుచ్చెయ్యపేట, మాడుగుల మండల రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు సాగు నీరు లేక దిగులు చెందుతున్నారు. నారుమడుల్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. రూ.వేలల్లో వెచ్చించి డీజిల్ ఇంజిన్ల ద్వారా ఎక్కడో దూరంగా ఉన్న చెరువులు, చిన్నపాటి గెడ్డల నుంచి పైపుల సాయంతో నీటిని పొలాలకు అందిస్తున్నారు.

వర్షాధారంగా 80 శాతం సాగు

ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో మెట్ట భూములే ఎక్కువ. గ్రామాల్లో 80 శాతం భూముల్ని వర్షాధారంగానే సాగు చేస్తారు. వర్షం కురిస్తేనే మండలంలోని గ్రామాల్లో పంటలు పండుతాయి. వరుణుడి కరుణ లేకపోతే కరువు కోరల్లో చిక్కాల్సిందే. జోరుగా వర్షాలు కురిసే సమయంలో దాన్ని నిల్వ చేసుకునే వసతుల్లేవు. దీంతో వర్షపు నీరు వారం పదిరోజులతో సరి. వరి ఆకులు వేసి నెల రోజులవుతోంది. దమ్ములకు సరిపడా నీరు లేకపోవడంతో పలు గ్రామాల రైతులు గెడ్డలు, చెరువుల్లో ఉన్న నీటిని డీజిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు తరలించి, దమ్ము పడుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన చోట నీరు లేక సరిగా చేను ఎదగట్లేదని రైతులు వాపోతున్నారు. ఆగస్టు నెల వచ్చినా ఆశించిన వర్షాల్లేక ఎర్రవాయి ప్రాంతాల్లో 50 శాతానికిపైగా వరి నాట్లు పడలేదు. మండలంలోని 5,500 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో ఇంకా 2,700 ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది.

మెట్ట ప్రాంతాల్లో నిలిచిన నాట్లు

మాడుగుల మండలంలోని మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు చాలా ఆలస్యమయ్యాయి. గతంలో జూలై నాటికే వరినాట్లు దాదాపుగా పూర్తయ్యేవి. ఆగస్టు రెండో వారం ముగుస్తున్నా నాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. వరి నారు ముదిరిపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి ఉండదని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో జలాశయాలు, వ్యవసాయ మోటార్ల వసతులున్న చోట మాత్రమే ఖరీఫ్ నాట్లు పూర్తయ్యాయి. మెట్ట భూముల్లో వర్షాల్లేక నాట్లు పడలేదు. ఖరీఫ్ సీజన్లో మండల సాధారణ సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాలు. ప్రస్తుతం 8 వేల ఎకరాలకు దగ్గరగా నాట్లు వేశారు. ఇంకా 2 వేల ఎకరాలకు పైగానే నాట్లు వేయాల్సి ఉంది. జూలై రెండో వారంలో వర్షాలు అనుకూలించినా, నారు అందక నాట్లు వేయలేదు. ప్రస్తుతం వరినారు అంది వచ్చిందంటే వర్షాల్లేక నాట్లు వేయలేకపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

సబ్బవరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్. రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం

మునగపాక : మూలపేట గంగాలమ్మతల్లి గుడికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. తోటాడకు చెందిన దొడ్డి రమేష్, భవానీ దంపతులు, కుమారులు హర్షవర్దన్, ఆనంద్‌వర్ధన్ ఆదివారం రూ.50,116 నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి


జాతీయ జెండాలు అందజేస్తున్న 'మాఊళ్లో గ్రంథాలయం' అధ్యక్షుడు ధనశ్రీను

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని 'మా ఊళ్లో గ్రంథాలయం' అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీను కోరారు. మండలంలోని మంగళవరప్పేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం దేశభక్తి గీతాలు, స్వాతంత్య్ర దినోత్సవ గీతాలకు సంబంధించి శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు జెండాలు అందజేశారు. ధనశ్రీను మాట్లాడుతూ సెలవు రోజుల్లో పిల్లలు టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి వారం పిల్లలకు పుస్తక పఠనం అలాగే విలువలతో కూడిన విద్య, దేశభక్తిపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ప్రసాదరావు, గ్రంథాలయం డైరెక్టర్లు సునీత, కనక, తులసి తదితరులు పాల్గొన్నారు.